క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని అంజిరెడ్డి హాస్పిటల్‌లో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో రూ. 10 వేలు విలువ చేసే రక్త పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు ఆయన చెప్పారు. వైద్య సేవలు పొందిన వారికి ఉచితంగా మందులను కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు.

యోగాతో దేహ దారుఢ్యం, ఉత్సాహం

మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు

మాచర్ల: యోగాతో దేహ దారుఢ్యంతో పాటు మనిషికి ఉత్సాహం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు అన్నారు. స్థానిక శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మాచర్ల శ్రీశైలం రోడ్డులో గల స్వామి వివేకానంద సేవాశ్రమంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం పట్టణ మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు శిక్షణలో పాల్గొని, యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాచర్ల పట్టణ ప్రజలకు ఆరోగ్యాన్ని అందించటమే ధ్యేయంగా ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్న గోవింద రెడ్డిని కమిషనర్ అభినందించారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 26 రిపబ్లిక్ డే నుంచి ఉచిత యోగా క్లాసులు నిర్విఘ్నంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్త్రీలకు, పురుషులకు విడిగా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామికి సత్కారం



పిడుగురాళ్ల: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన కుమారస్వామిని ఆదివారం ఘనంగా సన్మానించారు. పిడుగురాళ్ల పట్టణంలోని సబ్ కోర్టు మాజీ పీపీ బగ్గి నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడారు. న్యాయవాదులతో సత్సంబంధాలతో పాటు బార్‌ను కుమారస్వామి చక్కగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నిక అవ్వడం ఆయన నాయకత్వ లక్షణాలకు మచ్చుతునకని పేర్కొన్నారు. న్యాయవాదులు బి.ఎల్.చిన్నయ్య, దివ్వెల శ్రీనివాసరావు, కొత్రపు శ్రీనివాసరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన



పిడుగురాళ్ల: పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ప్రదర్శనలో భాగంగా ఆదివారం మున్సిపల్ కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా కార్మికులు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కూడా తల్లికి వందనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సమ్మె కాల ఒప్పందాలు అమలు చేయాలని కోరారు. 12వ పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ఆషాఢ బోనాలు



పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ గుడిలో ఆదివారం ఆషాఢ బోనాలతో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పట్టణంలోని పలు వార్డుల నుంచి మహిళలు బోనాలతో గుడి వద్దకు చేరుకున్నారు.అక్కడే బోనాలను వండి అమ్మవారికి సమర్పించారు. మరి కొందరు అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు రాయితీపై వరి విత్తనాల పంపిణీ

నకరికల్లు: రాయితీపై వరి విత్తనాలను మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సోమవారం పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీ వరి విత్తనాలు పూర్తి ధర రూ.43 కాగా రాయితీపై కేజీ రూ.38కు రైతులకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కేఎస్ఎం-1638 రకం 50 క్వింటాళ్లు, బీపీటీ-5204 రకం 10 క్వింటాళ్లు పంపిణీ చేస్తామన్నారు. కావలసిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు

ఖరీఫ్ సాగుపై నీలినీడలు

- రైతుల ఆశలు ఆవిరి
- జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు
- మందకొడిగా వ్యవసాయ పనులు



గురజాలలో పత్తి చేనులో అరకదున్నుతున్న రైతు



నీరు లేక వెలవెలబోతున్న దైద మేజర్ కాలువ

గురజాల : ఈ ఏడాది ఖరీఫ్ సాగు జిల్లాలో ప్రశ్నార్థకంగా మారింది. సకాలంలో రుతుపవనాలు వచ్చాయని సంతోషించిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సాగు ముందుకు కదలడం లేదు. జూలై ముగుస్తున్నప్పటికి పంటల సాగు ఎక్కడి గొంగళి అక్కడే చందంగా ఉంది. పుష్కలంగా వర్షాలు కురిస్తే కానీ పొలాలు పదునెక్కి విత్తనాలు నాటలేమని రైతులు అంటున్నారు. సీజన్ దాటిన తరువాత పంటలు వేసినా ప్రయోజనం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిక్కుతోచని అన్నదాతలు

పల్నాడు ప్రాంతంలో ప్రధానంగా పత్తి , మిరప వంటి వాణిజ్య పంటలతో పాటు వరి సాగు సైతం రైతులు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం లేదు. కొన్ని ప్రాంతాల్లో బోర్లు, బావులు కింద పంటలు సాగు చేసినా గింజ మొలకెత్తే పరిస్థితులు కనిపించడం లేదు. జూలై చివరికి వస్తున్నా సాగు విస్తీర్ణం ప్రభుత్వ అంచనాలకు తగిన విధంగా లేకపోవడంతో అధికారుల్లో కూడా ఆందోళన నెలకొంది.

4వేల హెక్టార్లలో మాత్రమే సాగు

గతేడాది ఇదే సమయానికి పత్తి, మిరప పంటలతో పాటు వరి నారుమడులు పోసి రైతులు సాగుకు సిద్ధమయ్యారు. 41,000 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. కానీ ఈ ఏడాది మాత్రం ఇప్పటివరకు గురజాల నియోజకవర్గంలోని మండలాల్లోనే 4వేల హెక్టార్లలో పత్తి మాత్రమే సాగు చేశారు. వరి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము వంటి అపరాల సాగు అడుగు ముందుకు పడలేదు. అడపాదడపా కురిసిన వర్షాలతో ఉపయోగం లేకుండా పోయింది. పుష్కలంగా వర్షాలు కురిసి, భూములు పదునెక్కితేనే సేద్యం ముందుకు సాగుతుందని అన్నదాతలు అంటున్నారు. ప్రత్యామ్నాయంగా ఏం చేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. నియోజకవర్గంలో పలు కాల్వలు కూడా నీరు లేక వెలవెలపోతున్నాయి. ప్రధానమైన దైద మేజర్ కాలువలో కూడా చుక్క నీరు లేదు. నీటి విడుదలపై కూడా ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఈ పాటి కి నీరు సమృద్ధిగా రావడంతో వరి నారుమడులు వేసారని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికారులు త్వరితగతిన పంట కాలువలు వదిలి సహకరించాలని పలువురు కోరుతున్నారు.

పత్తి సాగుకే రైతుల ఆసక్తి

కేవలం నియోజకవర్గంలోని మండలాల్లో కేవలం రైతులు పత్తి సాగు మాత్రమే చేపడుతున్నారు. వరి సాగుపై అనిశ్చితి నెలకొంది. ఇప్పటి వరకూ నారు మడులను కూడా పెంచలేదు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో పాటు కాలువలకు సరిపడా నీటిని ఇస్తే తప్పా సాగు వేయలేమని రైతులు అంటున్నారు. వాస్తవానికి నియోజకవర్గ వ్యాప్తంగా 20వేల హెక్టార్లకు పైగా పత్తి సాగు చేపట్టాలి. ఇప్పటి వరకు 4వేల హెక్టార్లలో మాత్రమే సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

వరి సాగుకు అనుకూలమే..

ఆగస్టు మొదట్లో కాలువలకు నీరు వస్తుంది. దీంతో వరి సాగుకు అనుకూలంగా మారనుంది. ఈ సీజన్‌లో వరి సాగు 15వేల హెక్టార్లు పడనున్నట్లు అంచనా వేస్తున్నాం. కాలువలు వస్తే పత్తి సాగు కూడా పెరిగే అవకాశం ఉంది. మిరప పంట తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొక్కజొన్న, కంది పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తిగా ఉన్నారు. రైతులు కూడా వ్యవసాయాధికారుల సలహాలు తీసుకుని ముందుకు సాగాలి.

– శ్రీ కృష్ణదేవరాయులు,
వ్యవసాయ శాఖ ఏడీ, పిడుగురాళ్ల

పల్నాడులో రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా

వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్



పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వ పాలనలో పల్నాడులో మైనింగ్ మాఫియా రెచ్చిపోతోందని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ధ్వజమెత్తారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు.దాచేపల్లి ప్రాంతంలో శుక్రవారం జీఎస్టీ అధికారులు దాడు చేసి ఏకంగా 16 మైనింగ్ లారీలను అదుపులో తీసుకొని పోలీసులకు అప్పగించిన ఉదంతం రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియాకు ఉదాహరణగా చెప్పవచ్చని తెలిపారు. ఇటీవలే మరో తొమ్మిది గ్రానైట్ లారీలను జీఎస్టీ అధికారులు పట్టుకొని దాచేపల్లి మార్కెట్ యార్డులో ఉంచినట్లు తెలిపారు. అధికారులు కూడా ప్రజా ప్రతినిధులకు దాసోహం అంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు విమర్శించారు. సంపదను సృష్టిస్తా అంటూ రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు నాయుడు మాటలు చెబుతున్నారే తప్పా ఇంత వరకు చేసిందేమి లేదని విమర్శించారు. సంపద సృష్టించడం దేవుడు ఎరుగు.. ముందు రాష్ట్రంలోని సహజ సంపదను కాపాడాలంటూ అశోక్ కుమార్ సూచించారు. పల్నాడు ప్రాంతం నుంచి రోజూ 100 నుంచి 120 గ్రానైట్ లారీలు ఇతర రాష్ట్రాలకు వెళుతుంటాయని తెలిపారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రోజుకి రూ. 1.60 కోట్ల వరకు జీఎస్టీ గానీ రాయల్టీ లభిస్తుందన్నారు. అయితే, లారీలు సొమ్ము చెల్లించకుండానే అక్రమంగా తిరుగుతున్నాయని అశోక్ కుమార్ ఆరోపించారు. గ్రానైట్ దందాపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవలే లిక్కర్ కేసులో మిధున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి రోజాపై నగరి కూటమి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. వ్యక్తిగత విమర్శలు చేయడం సబబు కాదని ఖండించారు. అధికారులు వెంటనే స్పందించి గ్రానైట్ దందాకు అడ్డుకట్ట వేయాలని, లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ తరఫున ప్రత్యక్షంగా పోరాటాలు దిగుతామని ఆయన హెచ్చరించారు.

చదరంగంతో మెదడుకు పదును

మాచర్ల: చదరంగం ఆడటం వల్ల విద్యార్థుల మెదడుకు పదునుతో పాటు ఏకాగ్రత లభిస్తుందని మాచర్ల మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్ అన్నారు. అంతర్జాతీయ చదరంగం దినోత్సవం సందర్భంగా స్థానిక కోదండరామ దేవాలయంలో ఆదివారం వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కిరణ్ నేతృత్వంలో జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ చిన్నారులను సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంచి, మెదడుకు మేతనిచ్చే చదరంగాన్ని నేర్పిస్తూ వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలను నిర్వహిస్తున్న కోచ్ కిరణ్ కృషి అమోఘమని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో చదరంగం లాంటి క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కుర్రి సాయి మార్కొండరెడ్డి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దశరథన్, వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ ఒరుగంటి చెన్నకేశవరావు, ఫాస్ట్ రీజన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, అధ్యాపకులు ఆవుల ఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం చెస్ కిరణ్ దంపతులను ఘనంగా సత్కరించారు.

చిట్టడవిని తలపిస్తున్న శ్మశానవాటిక



నిరుపయోగంగా ఉన్న కాష్టం



ముళ్లపొదలతో శ్మశానవాటిక

- కర్మకాండలకు అవస్థలు పడుతున్న గ్రామస్తులు
- శ్మశానాన్ని వదలని ఆక్రమణదారులు

రెంటచింతల: స్థానిక ఏడుమంగళం వాగు సమీపంలో ఉన్న హిందూ శ్మశానవాటిక ముళ్లపొదలతో చిట్టడవని తలపిస్తోంది. కర్మకాండలు చేయడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని 880-ఎ సర్వే నంబర్‌లో 1.32 ఎకరాలు, 880-బీ2 సర్వే నంబర్‌లో ఎకరం కలిపి మొత్తం 2.32 ఎకరాలు ఉండాలి. అయితే ఇందులో ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది. సర్వే చేయించి ఆక్రమణదారుల చెర నుంచి భూమిని విడిపించి, అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాగు పొంగితే మునక

ఏడుమంగళం వాగు వైపు ప్రహరీ లేకపోవడంతో వర్షా కాలంలో శ్మశానం ముంపునకు గురవుతోంది. దహన సంస్కారం చేయడానికి గ్రామస్తులు అష్టకష్టాలు పడుతున్నారు. శ్మశానం అంతా ముళ్ల పొదలతో నిండిపోయింది. దీంతో లక్షలాది రూపాయల వ్యవయంతో నిర్మించిన కాష్టం, కర్మకాండలు నిర్వహించే గది రెండు నిరుపయోగంగా మారాయి. దీంతో నేలపై శవ దహనం చేయడానికి నానా అవస్థలు పడుతున్నారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ మాట్లాడుతూ శ్మశానం ముళ్లపొదలతో నిండి ఉండటంతో లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. దహన సంస్కారం అయిన వెంటనే స్నానం చేయాలంటే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోలి వాగుకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి, శ్మశానంలో నీటి సౌకర్యంతో పాటు ముళ్ల పొదలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి

ముప్పాళ్ళ: వ్యవసాయ సీజన్ ఆరంభం కావటంతో రైతులు సాగుకు కావాల్సిన విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విత్తనాలనే ఎంపిక చేసుకొని కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం సర్టిఫై చేసిన విత్తనాలను మాత్రమే అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు అనంతరం రశీదు తప్పనిసరిగా తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. విత్తన మొలక శాతం పరీక్షించుకున్న తర్వాతే సాగుకు శ్రీకారం చుట్టాలన్నారు. దుకాణదారులు కూడా రైతులకు బిల్లులు అందించాలని సూచించారు. రైతులు విత్తనాల ఎంపికతో పాటు యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకొని సాగు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తే మేలని చెప్పారు.

ఉపాధ్యాయులకు సత్కారం



అమరావతి: మండల పరిధిలోని మల్లాదిలో సుదీర్ఘకాలం పనిచేసి బదిలీపై వెళుతున్న ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయుడు సుబ్బారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తిలోకొరెడ్డిలు మల్లాది గ్రామ ప్రజలకు అందించిన సేవలను గుర్తించి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం సన్మానించారు. బదిలీపై వెళుతున్న వీరిని క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపా వాసు, వెంపా శ్రీను, రామారావు తదితరులు సత్కరించి వారి సేవలను కొనియాడారు.

సొసైటీ అధ్యక్షుడు విశ్వనాథం బాధ్యతలు స్వీకారం

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ నూతన అధ్యక్షుడిగా గడిపూడి విశ్వనాథం, డైరెక్టర్లు బండారు వీరాంజినేయులు, గోనుగుంట్ల నాగరాజులు ఆదివారం ఉదయం సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో విశ్వనాథం మాట్లాడుతూ రైతులు, సొసైటీ అధికారులు, సిబ్బంది సహకారంతో శావల్యాపురం సొసైటీ అభ్యున్నతికి తన శక్తివంచన లేకుండా వంతు కృషి చేస్తామన్నారు. సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాదు, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కోసం జగన్ విశేష కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వైస్సార్ సీపీ నేతలు

దాచేపల్లి : రైతు సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారని జెడ్పీటీసీ సభ్యుడు నల్గొండ ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణపురం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకుల అసత్య ఆరోపణలను వైఎస్సార్ సీపీ నేతలు ఖండించారు. 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిందని, రైతులు కూడా ఏ మాత్రం ఆసక్తి చూపలేదని ప్రకాష్ రెడ్డి తెలిపారు. చంద్రబాబు పాలన అంటేనే కరువు, వ్యవసాయానికి అనుకూలంగా ఉండదనే నానుడు ఉందని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో రైతులకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. ఎంపీపీ కందుల జాన్ మాట్లాడుతూ 2019-24 వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మండలంలోని రైతులకు రూ. 70 కోట్ల మేర లబ్ధి జరిగిందని చెప్పారు. రైతులు పంటలు వేసే నాటికే రైతు భరోసాను గత ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. నేటి కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవను అందించకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూడా కృష్ణ మాట్లాడుతూ 2014లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వంలో మండలానికి కేవలం రూ. 14 కోట్లు మాత్రమే లబ్ధి జరిగిందని తెలిపారు. రైతులంటేనే టీడీపీ నాయకులు చులకన భావంతో ఉన్నారని విమర్శించారు. వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదని హితవు పలికారు.

కేఎల్ టెక్నాలజీ ఇన్‌క్యూబేటర్స్‌తో అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న శాంతి శ్రీనివాసరెడ్డి, బాబు హరికృష్ణ

నరసరావుపేట రూరల్: ఏఎం రెడ్డి విద్యాసంస్థలతో, కేఎల్ టెక్నాలజీ ఇన్‌క్యూబేటర్స్ ఫౌండేషన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, కేఎల్ టెక్నాలజీ ఇన్‌క్యూబేటర్స్ ఫౌండేషన్ సీఈఓ బాబు హరికృష్ణ లంక, ఏపీఏపీ కేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ సీఈఓ వి.రమాకాంత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు స్టార్టప్‌లు, పరిశోధన, నూతన ఆవిష్కరణలపై అవగాహన పెరిగే విధంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని తెలిపారు. నూతన వ్యాపార ఆలోచనల అభివృద్ధి, టెక్నాలజీ కమర్షియలైజేషన్, స్టార్టప్‌ల విషయంలో ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మల్లికార్జున్, డిప్లమో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవభూషణరావు పాల్గొన్నారు.

‘నేను- నా తరం’ పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న అతిథులు

నరసరావుపేట రూరల్: బహుభాషా కోవిదుడు లంకా సత్యనారాయణ అని పలువురు వక్తలు కొనియాడారు. ప్రముఖ విద్యావేత్త లంకా సత్యనారాయణ రచించిన నేను- నాతరం ఆత్మకథ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఇస్సపాలెంలోని శ్రీ వాసవీ ఆర్య వైశ్య అన్నదాన సత్రంలో శ్రీనాథ సాహితీ పరిషత్ ఆంధ్ర చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వామి స్కూల్ డైరెక్టర్ ఈఎస్ స్వామి, నరసరావుపేట కళావేదిక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, సంస్కృత అధ్యాపకులు డాక్టర్ వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఎస్ స్వామి మాట్లాడుతూ లంకా సత్యనారాయణ మూడు భాషాల్లో ఎంతో పాండిత్యాన్ని గడించారని, ఎన్నో పుస్తకాలను తెలుగు నుంచి ఇంగ్లిష్‌లోకి అనువదించారని తెలిపారు. ఫౌండేషన్ ఫర్ ఎక్స్‌లెన్స్ సంస్థకు కో-ఆర్డినేటర్‌గా ఉండి ఎంతో మంది పేద విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూత అందిస్తున్నారని తెలిపారు. స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ నేను నా తరం పుస్తకం ద్వారా అనేక సామాజిక విషయాలను సత్యనారాయణ వెల్లడించారని తెలిపారు. కార్యక్రమంలో పద్య కవి ఈవూరి వెంకటరెడ్డి, మేళ్లచెరువు వీరాంజనేయులు, కెవికె రామారావు, బత్తుల మురళీ జల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



బట్లూరులో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు సేవ చేయడంలో హెల్ప్ ఫౌండేషన్ ఎప్పుడు ముందు ఉంటుందని, ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బట్లూరు సర్పంచ్ ఈదర రామారావు అన్నారు. మండలంలోని బట్లూరు గ్రామంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ ప్రథమ చికిత్స కేంద్రం సహకారంతో తెనాలికి చెందిన నేత్రాలయ ఐ కేర్, సత్తెనపల్లికి చెందిన శ్రీ సాయికృష్ణ డెంటల్ కేర్ వారిచే ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలు ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ కంటి, దంత సమస్యలకు వైద్యులు చెప్పే సలహాలు, సూచనలు పాటించి మెరుగైన ఆరోగ్యాన్ని కలిగి ఉండాలన్నారు. శ్రీ సాయికృష్ణ డెంటల్ కేర్ హాస్పిటల్ వైద్యులు శివరామకృష్ణ మాట్లాడుతూ నోటి పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. నోటి దుర్వాసన, దంతాల నుంచి చీము కారటం లాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. నేత్రాలయ ఐ కేర్ వైద్యులు వినీల మాట్లాడుతూ కంటి సంరక్షణ చాలా ప్రాముఖ్యమైనదని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. శిబిరంలో 140 మందికి కంటి పరీక్షలు, 80 మందికి దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకులు సిద్ధార్థ, సుభాని, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు శ్రీలత, చందు, భవాని, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు సీఆర్ మోహన్



సీఆర్ మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలూరిపేట: కార్మిక, కర్షక ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసిన పోరాట యోధుడు సీఆర్ మోహన్ అని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబూరావు కొనియాడారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు సీఆర్ మోహన్ సంస్మరణ సభ ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సీఆర్ మోహన్ స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చివరిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి శ్రమించిన నాయకుడు సీఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు కందిమళ్ల వెంకటేశ్వర్లు, తుబాటి సుభాని, చెరుకుపల్లి సృజన్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

బెల్లంకొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా కాలువల నుంచి చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎర్రబాలెం మేజర్ కాలువ చైర్మన్ మాచర్ల ముస్తఫా తెలిపారు. ఆదివారం మండలంలోని ఎర్రబాలెం మేజర్ కాలువకు మరమ్మతు పనులను స్థానిక అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. మేజర్ కాలువకు గండ్లు పడి, పూడిక ఏర్పడి నీటి ప్రవాహానికి అంతరాయాలు కలుగుతుంటడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు మేజర్ కాలువకు మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్పీ ఏఈ ఇబ్రహీం, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, నాయకులు పాల్గొన్నారు.

పెద్దింటమ్మ తల్లికి ఆషాఢ బోనాల సమర్పణ



ఊరేగింపుగా బోనాలు తీసుకువెళుతున్న గ్రామస్తులు

అమరావతి: పంచారామ క్షేత్రాల్లో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లికి ఆషాఢ మాసం బోనాలు సమర్పించే కార్యక్రమాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే పెద్దింటమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకం, అనంతరం వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు పొంగళ్లు చేసుకుని మేళతాళాలతో ఊరేగింపుగా పెద్దింటమ్మ గుడికి చేరుకుని అమ్మవారికి ఆషాఢ మాస బోనాలు సమర్పించారు.